సాక్షి రంగారెడ్డి

సోమవారం। 10। జూలై। 2023



సేంద్రియంలో ఎంతో వృద్ధి

సేంద్రియ ఎరువుల తయారీకి శంకర్‌పల్లి మండలంలోని మోకిల గ్రామంలో శ్రీకారం చుట్టారు.

8లో▸



రావి చెట్టుకు పుట్టిన రోజు

తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో రావిచెట్టుకు ఆదివారం పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

8లో▸



సేవలు మరువలేనివి

రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్, ప్రజానాయకుడు సాయిచంద్ చేసిన సేవలు మరువలేనివని తాండ్ర విశాల అన్నారు.

8లో▸

న్యూస్‌రీల్

15 నుంచి మెగా జాబ్‌మేళా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం పాలమూరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ట్రస్టు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంతో మంది యువతీ యువకులు ఉన్నత విద్యను అభ్యసించి ఉపాధి, ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్నారని అన్నారు. వారికి ఉపాధి కల్పించేందుకు శ్రేయాస్ కన్సల్టీ సర్వీస్ సహకారంతో పాలమూరు ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 17వ తేదీ వర పట్టణంలోని ఈడెన్ ఫంక్షన్ హాల్‌లో రెండో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీ, ఐటీఈఎస్, కోర్, మేనేజ్‌మెంట్, ఫార్మా, బ్యాంకింగ్ రంగాల్లో సుమారు ఐదువేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. పది నుంచి ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీఫార్మా, ఎంఫార్మా, చేసిన వారు పాల్గొనవచ్చని తెలిపారు. రూ.20వేల నుంచి రూ.50వేలకు పైగా వేతనాలు పొందొచ్చన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 94909 56938, 93981 60997 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వచ్చే ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ పాత్ర కీలకం

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



యూత్ కాంగ్రెస్ సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్: యూత్ కాంగ్రెస్ సభ్యులు చురుకైనా పాత్ర పోషిస్తూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. కార్పొరేషన్‌లో పరిధిలోని నాదర్‌గుల్‌లో ఆదివారం యూత్ కాంగ్రెస్ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని, పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో యూత్ కాంగ్రెస్ పాత్ర చాలా కీలకమని అన్నారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, ప్రొటోకాల్ కార్యదర్శి బంగారు బాబు, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, కార్పొరేషన్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, మహిళా అధ్యక్షురాలు అమృత, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.


ప్రాణాలైనా అర్పిస్తాం .. ఫార్మాసిటీ రానివ్వం



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రొఫెసర్ కోదండరాం, ముదిరెడ్డి కోదండరెడ్డి తదితరులు

యాచారం: ఫార్మాసిటీ బాధిత గ్రామాల్లో ప్రజాయాత్రలో భాగంగా ఆదివారం నక్కర్తమేడిపల్లి-నానక్‌నగర్ గ్రామాల మధ్యన నిర్మించిన ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట స్తూపం వద్ద ప్రొఫెసర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి, పర్యావరణవేత్తలు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి శ్రేణులు ప్రతిజ్ఞ చేశారు. ఫార్మాసిటీని ఏర్పాటు కాకుండా అడ్డుకుంటాం .. ప్రాణాలైనా అర్పిస్తాం గానీ ఫార్మాసిటీని రానివ్వం అంటూ ప్రతిజ్ఞ చేశారు. 2018లో ఫార్మాసిటీపై ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించిన స్థలంలోనే స్థానిక రైతులు ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట స్తూపాన్ని నిర్మించారు.

దిగొచ్చిన చికెన్



వికారాబాద్ అర్బన్: చికెన్ ధర దిగొచ్చింది. రెండు నెలల పాటు కిలోకు రూ.300 నుంచి రూ.340 వరకు పలకగా.. గడిచిన వారం రోజుల్లో ఏకంగా రూ.100 తగ్గింది. ఆదివారం మార్కెట్‌లో కిలో చికెన్ రూ.250 చొప్పున విక్రయించారు. ధర తగ్గడంతో కోడికూర ప్రియులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు మూడు నెలల పాటు ఇవే ధరలు కొనసాగవచ్చని వ్యాపారులు పేర్కొంటున్నారు.

బోనం.. వైభవం



షాబాద్ మండలం చందనవెల్లిలో..

బోనాల ఉత్సవాలను ఆదివారం ఆయా గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపు అమ్మవారి దేవాలయాలకు చేరుకున్నారు. ప్రదక్షిణలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తువుల పూనకాలు, బోనాల పాటలు, యువకుల స్టెప్పులతో ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది.



ఇబ్రహీంపట్నం: బోనాలతో ఊరేగింపు



పహాడీషరీఫ్: భక్తులతో రద్దీగా మారిన పోచమ్మ దేవాలయం

ఇదేం క్రమబద్ధీకరణ!

హయత్‌నగర్ వీరన్నగుట్టకు చెందిన ఎం.నర్సమ్మ తనకున్న 300 గజాల స్థలంలోని ఇంటి క్రమబద్ధీకరణ కోసం జీఓ నంబర్ 59 కింద దరఖాస్తు చేసుకుంది. క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చిన అధికారులు తొలుత ఇందుకు రూ.77.28 లక్షల ఫీజుగా నిర్ణయించారు. ప్రస్తుతం అక్కడ ప్రభుత్వ మార్కెట్ విలువ గజానికి రూ.6,800 ఉంది. ఈ చొప్పున రూ.20 లక్షలకు మించదు. కానీ సంబంధిత రెవెన్యూ అధికారులు బహిరంగ మార్కెట్ విలువ కట్టారు. సదరు లబ్ధిదారు దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ఫీజును సవరించాల్సిందిగా కోరుతూ ఒకవైపు అధికారుల చుట్టూ తిరుగుతుండగానే మరోవైపు క్షేత్రస్థాయి అధికారులు జేసీబీతో వచ్చి ఓ గదిని నేలమట్టం చేశారు. అనంతరం ఫీజును రూ.19.04 లక్షలకు కుదించి ఇటీవల తిరిగి నోటీసులు పంపడం గమనార్హం. ఇలా ఒక్క నర్సమ్మ మాత్రమే కాదు జీఓ నంబర్ 58, 59 కింద దరఖాస్తు చేసుకున్న వందలాది మందికి ఇలాంటి చేదు అనుభవమే ఎదురవుతోంది.

- 58,59 జీఓల కింద దరఖాస్తుల స్వీకరణ
- ప్రభుత్వ మార్కెట్ ధరకు మించి చార్జీలు
- చెల్లించకుంటే కూల్చేస్తామంటున్న అధికారులు
- జేసీబీలతో ఇళ్ల ముందుకు చేరుకుంటున్న వైనం
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు



జేసీబీతో కూల్చివేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వెలసిన నిర్మాణాలు, కబ్జాదారుల చేతుల్లో ఉండిపోయిన ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం తెచ్చిన జీఓ నంబర్ 58, 59 కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. ఒక్కోచోట ఒక్కో నిబంధన అమలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ వాస్తవ ధరకు మించి నిర్ణయించి తాఖీదులు కూడా జారీ చేశారు. దీంతో చెల్లించే స్థోమత లేక కొంత మంది, ఇష్టం లేక మరికొంత మంది వెనుకాడుతున్నారు. ఎలాగైనా ఆక్రమణదారుల నుంచి పెద్ద మొత్తంలో రాబట్టాలనే ఆలోచనతో అధికారులు జేసీబీలతో ఆయా నిర్మాణాల ముందుకు చేరుకుంటుండటంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు దశల్లో 58,59 జీఓల కింద 47 వేలకుపైగా దరఖాస్తులు అందాయి. వీటిలో అత్యధికంగా అబ్దుల్లాపూర్‌మెట్, బాలాపూర్, గండిపేట, హయత్‌నగర్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, ఇబ్రహీంపట్నం మండలాల నుంచి అందాయి. కోర్టు కేసులు, దాయాదుల అభ్యంతరాలు, చెరువు శిఖాలు, శ్మశాన వాటికలు, పార్కులు, ఇతర కారణాలతో మెజార్టీ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి.

నోటీసులిచ్చినా స్పందన కరువే..

భూముల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం 2022 ఆగస్టులో జీఓ నంబర్ 58, 59లను తీసుకొచ్చింది. తొలుత 2014 జూన్ 2కు ముందు ఆక్రమణల్లో ఉన్న స్థలాలు, నిర్మాణాలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. జీఓ నంబర్ 58 కింద 19,661 దరఖాస్తులు రాగా, అధికారుల విచారణ తర్వాత వీటిలో 4,552 క్రమబద్ధీకరణకు అర్హత పొందాయి. జీఓ నంబర్ 59 కింద 13,231 దరఖాస్తులు రాగా, వీటిలో 2,750 అర్హత సాధించాయి. ఇక జీఓ నంబర్ 118 కింద ఎల్బీనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలో ఎంపిక చేసిన 44 కాలనీల నుంచి మరో 5,802 దరఖాస్తులు రాగా 4,947 ఆమోదం పొందాయి. తొలిదశలో వచ్చిన వాటిలో మెజార్టీ దరఖాస్తులు తిరస్కరణకు గురి కావడంతో ప్రభుత్వం మరో అవకా శం కల్పించింది. కటాఫ్ డేట్‌ను 2014 జూన్ 2 నుంచి 2020 జూన్ వరకు పెంచింది. ఏప్రిల్ 1 నుంచి మే 31 వరకు మళ్లీ అవకాశం కల్పించింది. దీంతో కొత్తగా మరో 13,997 దరఖాస్తులు అందాయి. వాటి పరిశీలన ఇప్పటికీ పూర్తి కాలేదు.

ప్రభుత్వ భూమికి ప్రైవేటు ధరలా..?

తొలి దశ పరిశీలనలో ఆమోదం పొందిన దరఖాస్తుదారులకు చెల్లించాల్సిన ఫీజులు నిర్ణయించి, ఆ మేరకు ఆయా లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారు. వీరిలో కొంత మంది చెల్లించగా.. మరికొంత మంది ఇందుకు నిరాకరిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ విలువతో సంబంధం లేకుండా అధికారులు ఆయా ప్రాంతాన్ని బట్టి బహిరంగ మార్కెట్‌లోని భూమి విలువతో సమానంగా ఫీజు నిర్ణయిస్తున్నారు. ఈ మేరకు నోటీసులు జారీ చేయడంపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఎలాగైనా వారి నుంచి నిర్దేశిత ఫీజు వసూలు చేయాలనే లక్ష్యంతో అధికారులు జేసీబీలను వెంట తీసుకెళ్తున్నారు. ఫీజు చెల్లిస్తారా..? ఇంటిని కూల్చమంటారా..? అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. హయత్‌నగర్, బాలాపూర్, సరూర్‌నగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, గండిపేట, శంకర్‌పల్లి, అబ్దుల్లాపూర్ మెట్, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో ఈ వేధింపులు ఎక్కువైనట్లు సమాచారం. క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులపై ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు పెరుగుతుండటమే ఇందుకు కారణమని తెలిసింది.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి అన్నారు. మీర్‌పేట కార్పొరేషన్ 9వ డివిజన్‌లో రూ.6 కోట్ల వ్యయంతో చేపట్టిన సీసీ, బీటీ రోడ్లకు ఆదివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో మీర్‌పేట కార్పొరేషన్‌ను కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా ట్రంక్‌లైన్, నాలాల నిర్మాణంతో ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని, మురికిమయంగా ఉన్న గొలుసు కట్టు చెరువులను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మిషన్ భగీరథ, పెన్షన్ల పెంపు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సొంత స్థలం ఉన్న వారికి రూ.3 లక్షల ఆర్థిక సాయం, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతుబీమా, రైతుబంధు, ఉచిత విద్యుత్, చేతివృత్తుల వారికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం, గౌడన్నలకు రూ.5 లక్షల బీమా వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. దేశమంతా తెలంగాణ వంటి పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, కో ఆప్షన్ సభ్యులు, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.



ప్రశాంతిహిల్స్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి తదితరులు

ఘాటెక్కిన పచ్చిమిర్చి

కిలో రూ.110 నుంచి రూ.150

షాబాద్: పచ్చిమిర్చి ఘాటెక్కింది. వారం రోజుల్లో ఏకంగా కిలో రూ.70 నుంచి రూ.150కి పాకింది. పేద, మధ్య తరగతి ప్రజలు, చిరు హోటళ్లు, బండ్లపై బజ్జీలు వేసి జీవనం డగిపే చిరువ్యాపారులకు ఈ ధరలు మింగుడు పడడం లేదు. మరోవైపు వర్షాభావం కారణంగా దిగుబడి తగ్గిందన్నా కారణంగా దళారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచేస్తున్నారు. మిర్చి పండించే రైతు నుంచి వ్యాపారులు, దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్లలో మార్కెట్లో అధికంగా విక్రయిస్తున్నారు.



చేవెళ్ల, షాద్‌నగర్, సర్దార్‌నగర్ మార్కెట్లలో కిలో రూ.110–120కి విక్రయిస్తుండగా దుకాణాలు, రోడ్డు పక్కన రూ.150 వరకు అమ్ముతున్నారు.

సంపూర్ణ ఆరోగ్యంతోనే ఆనందం



ఆరోగ్య రథాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

- ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి
- చేవెళ్ల ఆరోగ్య రథం ప్రారంభం

చేవెళ్ల: ప్రతి ఇంట్లో సంపూర్ణ ఆరోగ్యం ఉంటేనే ఆనందం ఉంటుందని ఎంపీ డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి అన్నారు. తనసొంత నిధులతో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన 'చేవెళ్ల ఆరోగ్య రథం'ను మండలంలోని ఆలూరులో ఆదివారం ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడే సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆరోగ్య రథాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామంలోని నిరుపేదలకు సంపూర్ణ ఆరోగ్యం అందించటమే లక్ష్యంగా ఈ రథాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఈ రథంలో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి ప్రతి ఒక్కరికీ హెల్త్‌కార్డులను అందించనున్నట్టు చెప్పారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈ రథం తిరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆలూరును మండలంగా చేసే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ఎంపీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం.మాలతి, సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీలు యాదమ్మ, నరేందర్, ఉప సర్పంచ్ కె.వెంకటేశ్, యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ కె.శివప్రసాద్, మొయినాబాద్ జెడ్పీటీసీ శ్రీకాంత్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లక్నోలో బీకేఎంయూ జాతీయ మహాసభలు

కాచిగూడ: భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) అఖిల భారత మహాసభలు ఆగస్టు 2 నుంచి 5 వరకు లక్నోలో జరుగుతాయని బీకేఎంయూ జాతీయ కార్యదర్శి ఎమ్మెస్ నిర్మల్ తెలిపారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సి ల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య పాల్గొన్నారు.

ప్రజలకు చేరువవుతున్న సిటీబస్సు

అత్యుత్తమ రీజియన్‌గా నిలిచిన సికింద్రాబాద్

- ఆదాయం, ఆక్యుపెన్సీలో గణనీయమైన అభివృద్ధి
- వివిధ విభాగాల్లో ఏకంగా 56 ప్రగతిచక్ర అవార్డులు



సాక్షి, సిటీబ్యూరో: 'ప్రయాణికుల వద్దకు సిటీబస్సు' స్ఫూర్తితో ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్ పరుగులు తీస్తోంది. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా నిర్వహించే రూట్ సర్వేలు సత్ఫలితాలనిస్తున్నాయి. జగద్గిరిగుట్ట, బాచుపల్లి, గండిమైసమ్మ, ఘట్కేసర్, కీసర,బీహెచ్ఈఎల్, ఇబ్రహీంపట్నం వంటి నగర శివారు ప్రాంతాలను ఐటీ కారిడార్‌లకు, నగరంలోని ప్రధాన మార్గాలకు అనుసంధానం చేస్తూ ప్రయాణికులకు మెరుగైన రవాణా సదుపాయాలను అందజేయడంలో అధికారులు కృషి ఫలిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం సికింద్రాబాద్ రీజియన్ ప్రయాణికుల ఆక్యుపెన్సీలో, ఆదాయంలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. గతసంవత్సరం 58.19 శాతం ఉన్న ప్రయాణికుల భర్తీ శాతం ఈ సంవత్సరం అనూహ్యంగా 69.09 శాతానికి చేరుకోవడం విశేషం. అలాగే ఆదాయ సముపార్జనలోనూ మెరుగైన ఫలితాలను నమోదు చేసింది. గత సంవత్సరం ఒక కిలోమీటర్‌పైన రూ.36.66 చొప్పున లభించగా, ఈ సంవత్సరం అది ఏకంగా రూ.49.51 గా నమోదైంది. దీంతో కేవలం అత్యుత్తమ రీజియన్‌గానే కాకుండా ఈ సంవత్సరం ఆ ఒక్క రీజియన్‌కే వివిధ కేటగిరీల్లో మొత్తం 56 ప్రగతిచక్ర అవార్డులు లభించడం విశేషం.

ప్రయాణికుల చెంతకు బస్సు

◆ గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 1050 కిపైగా రూట్‌లలో సిటీ బస్సులు నడుస్తున్నాయి. కానీ ప్రయాణికులు ఏ రూట్ నుంచి ఏ రూట్‌కు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారనే అంశం ఎంతో కీలకం. ఈ క్రమంలో సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ వెంకన్న వివిధ రూట్‌లపైన సీరియస్‌గా దృష్టి సారించారు. ప్రయాణికులు ఎటు వైపు నుంచి ఎటు వైపు ఎక్కువగా వెళ్తున్నారనే శాస్త్రీయమైన అధ్యయనం ఆధారంగా వివిధ మార్గాల్లో బస్సులను అందుబాటులోకి తెచ్చారు. అలాగే వివిధ మార్గాల్లో ఔటర్‌కు చేరుకొనేవారి కోసం, ఔటర్ సర్వీసు రోడ్లలో ప్రయాణికుల కోసం సిటీ బస్సులను విస్తరించడం వల్ల ఈ ఏడాది సికింద్రాబాద్ రీజియన్ ఉత్తమ ఫలితాలను సాధించింది. తెలంగాణ ఆర్టీసీలోని మొత్తం 11 రీజియన్‌లలో సికింద్రాబాద్ ' ది బెస్ట్'గా అవార్డును అందుకొంది.

అందరి విజయం: వెంకన్న, ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్

'ఇది మా అందరి సమిష్టి కృషి ఫలితం.ప్రతి డిపో కష్టం ఉంది.విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగి అంకితభావం ఉంది. గతేడాది కంటే ఈ ఏడాది నష్టాలను చాలా వరకు తగ్గించుకోగలిగాం. ప్రయాణికుల సంఖ్య ఇతోధికంగా పెరిగింది. ప్రయాణికుల అవసరాలను గుర్తించి బస్సులు నడపడంతోనే చక్కటి ఫలితాలు లభిస్తాయి.త్వరలోనే పూర్తిస్థాయిలో నష్టాలను అధిగమిస్తాం.

ఇదీ ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్ ప్రగతి ..

మొత్తం డిపోలు: 11

బస్సులు: 1450

ప్రయాణికులు: 12 లక్షలకు పైగా (సుమారు)

గత సంవత్సరం ఆక్యుపెన్సీ : 58.18 శాతం

ఈ సంవత్సరం: 69.09 శాతం.

గత సంవత్సరం ఈపీకే రూ.36.66,

ఈ సంవత్సరం: రూ.49.51

(ఎర్నింగ్ పర్ కిలోమీటర్)

కాంగ్రెస్‌కు ప్రజాదరణ పెరుగుతోంది



దీన్‌దయాళ్‌నగర్‌లో జరిగిన జెండా ఆవిష్కరణలో పాల్గొన్న చల్లా నర్సింహారెడ్డి తదితరులు

డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: దేశంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ దీన్‌దయాళ్‌నగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర, కర్ణాటకలో కాంగ్రెస్ విజయం, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ తరువాత కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వచ్చిందని, ఇతర పార్టీల నుంచి నేతలు పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. అమరుల త్యాగాలకు గుర్తింపు, నియామకాలు, నిరుద్యోగ నిర్మూలన, యువతీ యువకుల సాధికారత, మెరుగైన విద్య వంటి సమగ్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ రానున్న రోజుల్లో అధికారం చేపట్టబోతోందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్క కార్యకర్తకు భవిష్యత్తులో గుర్తింపు లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, నాయకులు ఏనుగు జంగారెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, దేవగోని కృష్ణ, సిద్దాల శ్రీశైలం, నిమ్మల వెంకటేశ్‌గౌడ్, కీసర యాదిరెడ్డి, గంగమ్మ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోకిలలో చెత్తశుద్ధి.. సేంద్రియంలో ఎంతో వృద్ధి

గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు
- రీసైక్లింగ్‌తో కంపోస్టు ఎరువు తయారీ
- గండిపేట వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహణ
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం



కంపోస్టు ఎరువు తయారీ



కంపోస్టు ఎరువును తయారు చేస్తున్న సిబ్బంది

శంకర్‌పల్లి: ఇళ్లల్లో చెత్తను, వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తిరిగి ఉపయోగించుకోవచ్చనే విషయాన్ని అందరూ విస్మరిస్తున్నారు. ప్రతీ గ్రామంలో సేకరించిన చెత్తను కుప్పలుగా పోసి కాల్చివేస్తున్నారు. దీంతో చెత్తనుంచి వచ్చే పొగను పీల్చడంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇళ్ల నుంచి వచ్చే చెత్త ఎక్కడ వేయాలి అన్నది ప్రస్తుతం పురపాలకాల్లో, నగరాల్లో, గ్రామ పంచాయతీల్లో ప్రశ్నార్థకంగా మారింది. ఇంటింటా చెత్త సేకరణ చేస్తుండగా తడి, పొడి చెత్తను వేరుగా చేసి తీసుకువెళ్లడం ప్రధానం. ఇక్కడే పొరపాటు జరుగుతోంది. తడి, పొడి చెత్త వేరు చేయడం లేదు. తడి చెత్తతో ఇంట్లోనే సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవచ్చు. లేదంటే వర్మీ కంపోస్ట్ యార్డులకు తరలించే వీలుంది. పొడి చెత్తలో ప్లాస్టిక్ సంచులు, సీసాలు, వస్తువులు, కాగితాలు ఇతర సామాన్లు ఉంటాయి. వీటిని వేరు చేస్తే తిరిగి ఉపయోగించుకోవచ్చు. కొన్ని గ్రామాల్లో గుంతల్లో ఖాళీ స్థలాల్లో వేసి కాల్చి వేస్తున్నారు. దీని ద్వారా వర్షపు నీరు ప్రవహించి ఆ నీరు అంతా గండిపేట జలాశయానికి వెళ్లి కలుషిత నీరుగా మారుతోంది. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను నేరుగా రీసైక్లింగ్ చేసి సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు ఉపయోగ పడే విధంగా చేయవచ్చు.

మోకిలలో శ్రీకారం

సేంద్రియ ఎరువుల తయారీకి శంకర్‌పల్లి మండలంలోని మోకిల గ్రామంలో శ్రీకారం చుట్టారు. రూర్బన్ నిధులు రూ. 20లక్షలు, పంచాయతీ నిధులు రూ.30 లక్షలు వెచ్చించి ఇన్సులేటర్ యంత్రం, దానికి అవసరమయ్యే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొనుగోలు చేశారు. చెత్తను డంపింగ్ చేసుకొని ఎరువుగా తయారు చేసేందుకు షెడ్డును సైతం నిర్మించారు. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి కంపోస్టు ఎరువును తయారు చేసే విధానంలో విజయం సాధించారు.

తయారీ విధానం..

మోకిలలో గండిపేట వెల్ఫేర్ సొసైటీ సహకారంతో తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. తడి చెత్తను మాత్రమే వినియోగించుకుంటారు. పొడి చెత్తను వేరు చేస్తారు. పొడిచెత్తలోని ఇతర ప్లాస్టిక్ కాగితాలను ఇన్సులేటర్‌లో వేసి కాల్చివేస్తారు. తడి చెత్తను మిషన్‌లో వేసి కంపోస్టు ఎరువుగా తయారు చేస్తారు. సుమారు 20రోజుల కాలవ్యవధిలో ఎరువుగా తయారు అవుతుంది. తయారు చేసిన ఎరువును పొలాలకు ఎరువుగా ఉపయోగిస్తున్నారు.ఈ ఎరువును ఇళ్లల్లో పెంచుకునే మొక్కలకు కూడా వినియోగించుకోవచ్చు. అవసరం ఉన్న వారు ఇక్కడి వచ్చి తీసుకువెళ్లొచ్చు. మోకిలలో చేపడుతున్న ఈ విధానాన్ని అందరూ అభినందిస్తున్నారు.

రోజూ 50కిలోల ఎరువు తయారీ..

మోకిల గ్రామంలో రోజు 10 ట్రాక్టర్ల మేర చెత్తను సేకరిస్తున్నారు. ఈ చెత్తను రీసైక్లింగ్ చేసి రోజుకు 50కిలోల కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. గ్రామంలోని రైతులకు, ఇంటి యజమానులకు, విల్లాలు, అపార్ట్‌మెంట్ వారికి ఎరువును ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. బయట నుంచి ఎవరైనా ఎరువు కోసం వస్తే కిలోకి రూ. 20 చొప్పున విక్రయిస్తున్నారు.

ప్రజల సహకారం భేష్



మోకిలలో ఇళ్ల నుంచి సేకరించిన తడి, పొడి చెత్త ద్వారా కంపోస్టు ఎరువును తయారీ చేస్తున్నారు. ఇందుకు ప్రజల సహకార, అధికారుల ప్రోత్సాహం ఎంతో ఉంది. డీఆర్‌డీవో ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రభాకర్, ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీడీవో వెంకయ్యగౌడ్ ప్రోత్సాహంతో రూర్బన్ పథకం ద్వారా నిధులు మంజూరు కావడంతో రీసైక్లింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశాం.

– పట్లోళ్ల సుమిత్ర, మోకిల గ్రామ సర్పంచ్

పారిశుద్ధ్యం మెరుగు



గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ ఎంతో బాగుంది. గ్రామం నగరానికి కూత వేటు దూరంలో ఉండటంతో విల్లాలు, అపార్ట్‌మెంట్లు వెలిశాయి. గతంలో చెత్తను ఎక్కడ వేయాలో తెలియని పరిస్థితి ఉండేది. కంపోస్టు ఎరువు తయారీ వల్ల పారిశుద్ధ్య సమస్య తొలగిపోయింది. రోజూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నాం. వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను ఇన్సులేటర్ యంత్రంలో వేసి కాల్చివేస్తున్నాం.

– వెంకయ్యగౌడ్, ఎంపీడీఓ

ఆదర్శంగా తీసుకోవాలి



మోకిల గ్రామాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి. తడి, పొడి చెత్తతో కంపోస్టు ఎరువును తయారు చేయడం ఎంతో అభినందనీయం. గ్రామంలో వెలుస్తున్న విల్లాలు, అపార్ట్‌మెంట్లలో చెత్తను సేకరించి కంపోస్టు ఎరువు తయారు చేయడం వల్ల ఈ ప్రాంతంలో పారిశుద్ధ్య సమస్య తొలగడంతోపాటు కాలుష్య రహిత ప్రాంతంగా మారింది.

– ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీపీ

అవగాహన కల్పించాం



మోకిల గ్రామంలోని తడి, పొడి చెత్తను సేకరించేందుకు రెండు నెలలు కష్టపడ్డాం. ప్రతి ఇంటితో పాటు, విల్లాలు, అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న ప్రజలకు అవగాహన కల్పించాం. సర్పంచ్, స్వచ్ఛంద సంస్థల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ప్రస్తుతం తడి, పొడి చెత్తలను వేరువేరుగా ఇస్తున్నారు. దీంతో గ్రామంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తడం లేదు.

– లక్ష్మీతులసి, గ్రామ కార్యదర్శి

రావి చెట్టుకు పుట్టినరోజు వేడుకలు

తలకొండపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రావిచెట్టుకు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. 2016లో జర్నలిస్టు బోళ్ల యాదయ్య మొక్క నాటారు. అది పెరిగి పెద్దదై వందలాది మందికి నీడనిచ్చే చెట్టుగా ఎదిగింది. ఈ సందర్భంగా ఆదివారం చెట్టుకు 7వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలీసులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద ఎత్తున అధిక సంఖ్యలో హాజరయ్యారు. కేక్ కట్ చేశారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులకు పండ్లు పంచారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ నర్సింహ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవాళి మనుగడకు చెట్లే ప్రాణాధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఏటా లక్షలాది మొక్కలు నాటి అడవుల పెంపకానికి తోడ్పడాలన్నారు. ఈ హరితహారం దేశానికే ఆదర్శమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మీదేవిరఘురాం, ఏఎస్ఐ సీతారాంరెడ్డి, మాజీ ఎంటీటీసీ యాదయ్య, నాయకులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో రావి చెట్టుకు పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

వ్యక్తి అదృశ్యం



వెంకటేశ్ (ఫైల్)

మీర్‌పేట: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ బద్యానాయక్ కథనం ప్రకారం.. నారాయణపేటకు చెందిన పొలంపల్లి వెంకటేశ్ (23) కొంత కాలంగా అల్మాస్‌గూడ వినాయకహిల్స్‌లో నివసించే సోదరి వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. ఈ నెల 3న వెంకటేష్ తన సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే వదిలేసి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సోదరుడు శ్రీకాంత్ ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త అన్నం తినడంలేదని.. భార్య ఆత్మహత్య

బంజారాహిల్స్: మూడు రోజులుగా తాను చేసిన వంటలు తినకుండా బయట తినడమే కాకుండా ఇదేమిటని అడిగితే సరైన సమాధానం చెప్పకపోవడంతో మనస్థాపానికి గురైన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని గౌరీశంకర్ కాలనీలో నివసించే కె.సంగీత (23) వివాహం 2019లో కె.సంజీవతో జరిగింది. డ్రైవర్‌గా పనిచేస్తున్న సంజీవ గత మూడు రోజుల నుంచి ఇంట్లో తినకపోవడంతో సంగీత ప్రశ్నించింది. ప్రతిరోజూ వంట చేస్తున్నానని, తినకపోవడంతో అవి పాడైపోతున్నాయని వెల్లడించింది. దీనికి తోడు ఆమెకు కొంత కాలంగా అనారోగ్యం కూడా సమస్యగా మారింది. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి సంజయ్ రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు అండగా ఉంటాం

రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షుడు బాలుయాదవ్

మీర్‌పేట: రైతు హక్కుల సాధన సమితి ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటుందని సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాలుయాదవ్ తెలిపారు. ఆదివారం మీర్‌పేట నందిహిల్స్‌లోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన నియామకాలు చేపట్టారు. సమితి మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సబితారెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొప్పుల శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా కూసం రామచంద్రారెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా బాలుయాదవ్ మాట్లాడుతూ రైతు హక్కుల సాధన సమితిని బలోపేతం చేయాలని, త్వరలోనే జిల్లా, మండల, గ్రామ కమిటీలను నియమిస్తామని చెప్పారు. రాష్ట్రంలో రైతుల కోసం జరిగే ప్రతి పోరాటంలో సమితి సభ్యులు భరోసాగా ఉండి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు జింకల యాదయ్య యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, బూర మల్సూర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శిగా రాము యాదవ్, కార్యదర్శిగా ఇస్మాయిల్ గురూజీ, కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి రాములు యాదవ్ పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేస్తున్న బాలుయాదవ్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

ఇబ్రహీంపట్నం: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తున్నట్లు ఆ సంఘం గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ వంగ సంజీవరెడ్డి అన్నారు. ఏబీవీపీ 75వ ఆవిర్భావ, జాతీయ విద్యార్థి దినోత్సవాలను పురస్కరించుకోని ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇబ్రహీంపట్నంలో జెండా అవిష్కరణను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1949 జూలై 9న ఢిల్లీ యూనివర్సిటీలో ఏబీవీపీ పురుడుపోసుకున్నదన్నారు. నేడు దేశంలోనే అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్‌గా కొనసాగుతుందన్నారు. ఏబీవీపీ జ్ఞానం, శీలం, ఏకత అనే అంశాలను వేదాలుగా మలుచుకోని జాతీయ పునర్నిర్మాణానికి ప్రాధాన్యతను ఇస్తూ విద్యార్థి సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సాయిధన్‌రాజ్, జగదీశ్, సందీప్, పవన్, విక్రమ్, సాయి, కిరణ్, వరుణ్‌లు పాల్గొన్నారు.



ఆవిర్భావ దినోత్సవంలో ఏబీవీపీ నేతలు

పేకాట రాయుళ్ల అరెస్టు

నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

షాద్‌నగర్‌రూరల్: పేకాట ఆడుతున్న వారిని పోలీసులు పట్టుకొని వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన శనివారం రాత్రి షాద్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని కేశంపేట సమీపంలోని ఓ ఇంట్లో పలువురు వ్యక్తులు పేకాట ఆడుతున్న పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. సయ్యద్ కలీం, మహ్మద్ మజీద్, ఎండీ ఆసీఫ్, మనోహర్, మహ్మద్ హమీద్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.40,550 నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

మృతదేహం లభ్యం



సయ్యద్‌మక్బూల్ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్ : పూర్తిగా కుళ్లిన స్థితిలో ఉన్న ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది.ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని కొత్తగూడెం వంతెన కింద కుళ్లిపోయిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం ఉందన్న సమాచారాన్ని ఆదివారం మధ్యాహ్నం డయల్ 100ద్వారా తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని వెళ్లి పరిశీలించారు. మృతదేహం గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. మృతుడి ప్యాంట్ జేబులో ఉన్న ఆస్పత్రి రశీదు ద్వారా అతని వివరాలను తెలుసుకోగా హైదరాబాద్‌లోని పురానాపూల్ ప్రాంతానికి చెందిన సయ్యద్ మక్బూల్ (80) గుర్తించారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కోవడంతోపాటు కుటుంబ సభ్యులు ఎవరూ లేరని, బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో గైడ్‌గా పనిచేస్తున్నట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

‘టెక్నాలజీ పెరిగినా దళితులకు అందని ఫలాలు’

ఖైరతాబాద్: రోజు రోజుకు టెక్నాలజీలో ముందడుగు వేస్తూ రోబో టెక్నాలజీ వరకు చేరుకున్నా దళితులు ఇప్పటికీ వందల సంవత్సరాలనాటి కుల వృత్తులకే పరిమితమవడం బాధాకరమైన విషయమని ఐపీఎస్ అధికారి డాక్టర్ చేతన అన్నారు. ఆదివారం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సమస్యలపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర చేతన మాట్లాడుతూ టెక్నాలజీ ఎంత పెరిగినా ఇప్పటికి ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తున్న కుల వృత్తుల్లోనే దళితులు కొనసాగడం అన్యాయమన్నారు. దళితులు పరిపాలనా రంగంలో ముందుండాలని సూచించారు.

సాయిచంద్ మిత్రుల 5కే రన్



బడంగ్‌పేట్: 5కే రన్‌లో మిత్రులు

బడంగ్‌పేట్: తెలంగాణ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేస్తూ అకాల మరణం చెందిన సాయిచంద్ దశదిన కర్మ కార్యక్రమంలో మిత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిత్ర బృందం రాకేశ్‌రెడ్డి, రవి, స్వామి ఆధ్వర్యంలో 5కే రన్‌ను చేపట్టారు. కార్పొరేటర్ దడిగ శంకర్, మీర్‌పేట్ ఎస్ఐ బద్యనాయక్ విచ్చేసి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. సాయిచంద్ స్వగృహం నుంచి సాగర్ హైవేలోని ఎరోప్లయిట్ ట్రేనింగ్ సెంటర్ వరకు కొన సాగించారు. ఇందులో సుమారు 2వందల మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ శ్రీకాంత్ కలిసి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఆరోగ్యం పట్ల జగ్రత్త వహించాలని అలాగే వ్యాయామం చేస్తూ, నడకపై శ్రద్ధ చూపాలని సూచించారు.

సేవలు మరువలేనివి

కేశంపేట: రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్, ప్రజాగాయకుడు సాయిచంద్ ఉద్యమ సమయంలో బీఆర్ఎస్ పార్టీకి చేసిన సేవలు మరువలేనివని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం దశదిన కర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాల శ్రావణ్‌రెడ్డి సాయిచంద్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. గాయకుడిగా అయన చేసిన సేవలను స్మరించుకున్నారు.



కేశంపేట: సాయిచంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి